andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.2 కనిష్ఠం 22.7
నిర్మల్ జిల్లా వార్తలు
శుక్రవారం 15 మార్చి 2024



కీలక సమావేశానికి ఐకేరెడ్డి డుమ్మా!

- ఆయన వెంటే మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సైతం..
- పార్టీ మారబోతున్న సంకేతాలకు ఊతం
- కొంతమంది నాయకులు మాత్రమే హాజరు
- జిల్లాలో ఇక తలకిందులు కానున్న సమీకరణలు

నిర్మల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారానికి పలు అంశాలు ఊతమిస్తున్నాయి. ముఖ్యంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ నియోజకవర్గ నాయకులకు సంబంధించిన కీలక సమావేశం అనేక సందేహాలకు ఆస్కారమిస్తోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ కీలక సమావేశానికి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షులు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు గైర్హాజరవ్వడం ఆ పార్టీలోనూ రాజకీయ వర్గాల్లోనూ దుమారం రేపుతోంది. అయితే అనారోగ్య కారణాలతో ఇంద్రకరణ్ రెడ్డి ఈ సమావేశానికి గైర్హాజరయ్యారంటూ ఆ పార్టీ నాయకులు సర్దిచెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం పూర్తి భిన్నంగా ఉన్నాయంటున్నారు. గత పదిరోజుల నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారన్న నేపథ్యంలో ఈ సమావేశానికి గైర్హాజరైన వ్యవహారం కీలకంగా మారుతోందంటున్నారు. అయితే ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దంటూ నిర్మల్ నియోజకవర్గంలో ఆ పార్టీకి చెందిన నాయకులతో పాటు ప్రస్తుత డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వర్గీయులు గత వారం రోజుల నుంచి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. కొంతమంది నాయకులు హైదరాబాద్‌లోనే మకాం వేసి పార్టీ అగ్రనేతలను కలుస్తూ ఇంద్రకరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయంటూ ఫిర్యాదులు చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీలో చేరే విషయమై ఇంద్రకరణ్‌రెడ్డి మొదటి నుంచి స్పష్టమైన వైఖరితోనే ఉన్నారని ఆయన ఎలాగైనా పార్టీ మారబోతున్నారంటూ ఆయన వర్గీయులు, అలాగే సన్నిహితులు మొదటి నుంచి స్పష్టం చేస్తున్నారు. కాగా ఈ అంశంపై ఇంద్రకరణ్‌రెడ్డి ఇప్పటి వరకు ఎక్కడ కూడా బహిరంగంగా నోరు విప్పకుండా తన అంతరంగాన్ని బయట పెట్టడం లేదు. అయితే కొంతమంది ముఖ్యనేతలకు, అనుచరులకు మాత్రం పార్టీ మారే విషయంలో ఆయన పరోక్ష సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే ఈ వ్యవహారంలో ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ పార్టీ కార్యకర్తలంద చేత ఫిరాయింపు విషయంలో ఒత్తిడి తెచ్చే విధంగా ప్రయత్నిస్తున్నారంటున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల కోసం కీలక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ నేతలందరినీ ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా ఆదేశించింది. అయితే ఈ సమావేశం కీలకమైందంటూ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు తప్పనిసరిగా హాజరై ఎన్నికల వ్యూహంపై సూచనలతో పాటు అధిష్ఠానం ఆదేశాలను పాటించాలంటూ సూచించింది. అయితే పార్టీకి సంబంధించిన జడ్పీ ఛైర్‌పర్సన్, మున్సిపల్ ఛైర్మన్, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, కోఆప్షన్ సభ్యులతో పాటు ఇతర పదవుల్లో ఉన్న వారు హాజరైనప్పటికీ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు హాజరుకాకపోవడంపై మాజీ సీఎం కేసీ ఆర్ సైతం విస్మయం వ్యక్తం చేశారంటున్నారు. అయితే స్థానిక నేతలతో ఇంద్రకరణ్‌రెడ్డి గైర్హాజరు విషయాన్ని కేసీఆర్ ప్రస్థావించినట్లు సమాచారం. ఐకేరెడ్డి సమావేశానికి ఎందుకు హాజరు కాలేదంటూ స్థానిక నేతలను ప్రశ్నించగా అనారోగ్య కారణాల వల్ల హాజరు కాలేదంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేశారంటున్నారు. అయితే దీనిపై కేసీఆర్ అలా చేయడం తప్పని హాజరుకావాల్సి ఉండేదని ఆయనకు నచ్చజెప్పాలంటూ సీనియర్ నేత జడ్పీ ఛైర్‌పర్సన్ భర్త రాంకిషన్‌రెడ్డికి సూచించినట్లు సమాచారం.

● వ్యూహాత్మకంగానే గైర్హాజరు

గత కొద్దిరోజుల నుంచి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారం క్రమంగా నిజమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆయన పార్టీ మారేందుకు మానసికంగా నిర్ణయించుకున్నప్పటి నుంచి పార్టీ అధిష్ఠానానికి దూరంగా ఉంటూ వస్తున్నారంటున్నారు. అయితే ఇంద్రకరణ్ రెడ్డి పార్టీ మారే అంశంపై సమాచారం తెలుసుకున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు సైతం ఆయనకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారంటున్నారు. కేవలం ఐకేరెడ్డి, హరీశ్‌రావుతోనే మాట్లాడినట్లు తెలుస్తోంది. ఆయనకు కూడా పార్టీ మారే విషయంపై స్పష్టతనివ్వకుండా దాటవేత వైఖరిని అవలంభించారంటున్నారు. ఇలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీకి సంబంధించిన కీలకమైన సమావేశానికి ఉద్దేశపూర్వకంగానే డు మ్మా కొట్టి తన చేరికపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చారంటున్నారు.

● రెండు మూడు రోజుల్లో కీలక సమావేశం

కాగా పార్టీ మారే విషయంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అచితూచి అడుగులు వేస్తూ తన వెంట నడుస్తున్న నేతలు, కేడర్‌ను చేజార్చుకోకుండా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారంటున్నారు. ఇందులో భాగంగానే ఆయన నిర్మల్‌లో ఉంటూ నేతలు, కార్యకర్తలందరితో ఇప్పటికే పలుసార్లు మాట్లాడారు. అయితే తన అంతరంగాన్ని బయట పెట్టకుండా నేతలు, కార్యకర్తల నుంచి సూచనల రూపంలో ఫీడ్ బ్యాక్‌ను తీసుకున్నారంటున్నారు. కేసీఆర్ సమావేశానికి గైర్హాజరైన ఇంద్రకరణ్‌రెడ్డి ఇక పార్టీ మార్పే విషయంలో క్రియాశీలకంగా వ్యవహరించబోతున్నారంటున్నారు. రెండు, మూడు రోజుల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు, అనుచరులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి వారందరి సూచనల మేరకే పార్టీ మారే విషయంలో ముందడుగు వేస్తాననే ప్రకటన చేయవచ్చంటున్నారు. ఈ సమావేశం కోసం ఇప్పటికే మండలాల వారిగా ఐకేరెడ్డి సమీకరణలు మొదలుపెట్టారంటున్నారు. బహుషా ఆదివారం ఈ సమావేశం జరిగే అవకాశాలున్నాయంటున్నారు. ఈ సమావేశం అనంతరం బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా మార్పులు చోటు చేసుకోనున్నాయని ప్రచారం జరుగుతోంది.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

ముథోల్, మార్చి 14 : పదోతరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. ఎలాంటి పుకార్లు, వదంతులు నమ్మకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. ప్రణాళికబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి అమ్మనాన్న కన్న కలలు సహకారం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సలహా, సూచనలు అందించారు. ఆయన వెంట ఎంఈవో మైసాజి, ప్రధానోపాధ్యాయులు అమీర్ కుస్రో, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మల్లారెడ్డి, రాజేశ్వర్, తదితరులున్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



పట్టణంలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

భైంసా, మార్చి 14 : గత నెల 28న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు గురువారం ముగిసాయి. డీఐఈవో జాదవ్ పరుశురామ్, డీఈసీ ప్రతినిధులు చేపట్టిన ప్రణాళికబద్ధమైన చర్యల మూలంగా ఇంటర్ పరీక్షలు ఆద్యాంతం సజావుగా కొనసాగాయి. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన చివరి పరీక్షలో జిల్లా వ్యాప్తంగా 229 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని 23 పరీక్షా కేంద్రాలలో మొత్తం 5854 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఇందులో 5625 మంది విద్యార్థులు హాజరవ్వగా 229 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కోర్సుకు సంబంధించి 5135 మంది విద్యార్థులకు 179 మంది, వోకేషనల్ కోర్సుకు సంబంధించి 719 మంది విద్యార్థులకు 50 మంది గైర్హాజరయ్యారు.

కేజీబీవీకి డెస్కుల విరాళం

దిలావర్‌పూర్, మార్చి 14 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయానికి అప్రవ కంపెనీ, బాలవికాస ఆర్గనైజేషన్ సంయుక్తంగా డెస్కులను విరాళంగా అందజేశారు. అప్రవ టీం సభ్యులు నీతు కుమార్, విపుల్ పటేల్, బాల వికాస్ సభ్యులు ఫ్రాన్సిక్‌రెడ్డి, కిరణ్, అఖిల్, ఎంఈవో శంకర్, ఎస్‌వో అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో 'పది' మైలురాయి

దస్తూరాబాద్, మార్చి 14 : విద్యార్థి జీవితంలో 10వ తరగతి మైలు రాయి లాంటిదని మండలంలోని మున్యాల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వామన్‌రావ్ అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వభూమిలో కట్టిన డి మార్ట్ అనుమతులు రద్దు చేయాలి


● బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ శివారులోని సోఫీనగర్ ప్రాంతంలో అక్రమంగా ప్రభుత్వభూమిలో నిర్మిస్తున్న డి మార్ట్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నిర్మల్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల అవినీతి అక్రమాలను ఎండగట్టారు. డి మార్ట్‌ను నిర్మిస్తున్న స్థలం పూర్తిగా ప్రభుత్వానికి చెందినదని, ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయన్నారు. ఇందులో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబ సభ్యుల హస్తం ఉందని ఆయన ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై స్పందించి డి మార్ట్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని, లేకుంటే పది వేల మందితో డి మార్ట్‌ను, అలాగే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అప్పటికీ కలెక్టర్ స్పందించకపోతే కలెక్టరేట్ ఎదుట ఈ నెల 20న ఆమరణ నిరాహార దీక్ష చేపడుతానన్నారు.

అసైన్డ్ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఇదిలా ఉంటే మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు డి- 1 పట్టాల పేరుతో చేసిన అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గాజులపేట ప్రాంతంలో శ్రీకృష్ణ ఆలయానికి సంబంధించిన ఎనిమిది ఎకరాల ఆలయ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ని పార్టీలు మారినా, ఎన్ని జిమ్మి క్కులు చేసినా మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని విడిచి పెట్టే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్న గారి భూమయ్య తదితరులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వానల్‌పాడ్ గ్రామాన్ని సందర్శించిన డీపీవో



వానల్‌పాడ్ గ్రామాన్ని సందర్శిస్తున్న డీపీవో

భైంసా రూరల్, మార్చి 14 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామాన్ని గురువారం డీపీవో శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల, జీపీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను, జీపీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయనను గ్రామస్థులు, జీపీ సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యదర్శి చాట్ల గాయత్రి, కారోబార్ నారాయణ, నాయకులు రామ్‌కుమార్, భూమేష్, తదితరులున్నారు.

'పెరిగిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలి'

నిర్మల్ కల్చరల్, మార్చి 14 : బీడీ కార్మికులకు పెరిగిన కరువుభత్యం ఏప్రిల్ 1 నుంచి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతి శీల బీడీవర్కర్ల సంఘం డిమాండ్ చేసింది. గురువారం కరువుభత్యంపై కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు వర్తిస్తుందన్నారు. బీడీ పరిశ్రమలో పని చేసే అన్ని రకాల కేటగిరిల కార్మికులు బీడీ ప్యాకర్స్, చాటర్స్, గంపవాల వారికే ఈ కరువుభత్యం వర్తిస్తుందన్నారు.

యాంత్రీకీకరణను రైతులు ఉపయోగించుకోవాలి : కలెక్టర్



వ్యవసాయ డ్రోన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 14 : వ్యవసాయదారులు యాంత్రికీకరణ ఉపయోగించుకోవాలని తద్వారా లబ్ధిపొందుతారని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఇఫ్కో వ్యవసాయ డ్రోన్ ప్రారంభించారు. నానో యూరియా, డీఏపీ వంటి ఎరువులు డ్రోన్ ద్వారా పిచికారి చేయవచ్చునన్నారు. మహిళలకు వందశాతం రాయితీపై ఈ డ్రోన్లు అందించడం జరుగుతుందన్నారు. మహిళా సాధికారిత సాధించేందుకు దోహదపడుతాయన్నారు. గ్రామీణ యువత, మహిళలు, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో డ్రోన్‌లను సమకూర్చారన్నారు. వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇఫ్కో ఎఫ్‌వో వికాస్, ఎస్ఎఫ్ఏ సాగర్, నవీన్, అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంటే బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్, మార్చి 14 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని ఒక్కొక్కటిగా అమలు చేస్తేంటే బీఆర్ఎస్ ఓర్చుకోలేక పోతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం కడెం, ఖానాపూర్ మండలాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే బొజ్జు భూమి పూజ చేశారు. ఆనాడు కడెం ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కడెం ప్రాజెక్టు గురించి విలేకరులు ప్రశ్నిస్తే ఆనాడు మంత్రిగా ఉన్న కేటీఆర్ కడెం ప్రాజెక్టు ఎక్కడ ఉందో తనకు తెలియదనడం సిగ్గుచేటు అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కడెం ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోని కేటీఆర్ ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఖానాపూర్ మండల కేంద్రంతో పాటు మస్కాపూర్, పాత ఎల్లాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు ఇటీవల కాలంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆందోళన చేసిన నేపథ్యంలో వారి వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. వెంటనే తాత్కాలికంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ కావలి సంతోష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, తదితరులున్నారు.

ఆలయ కమిటీ అభివృద్ధికి కృషి చేయండని ఎమ్మెల్యేకు వినతి

పట్టణ శివారు ప్రాంతంలోని పంచముఖ హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జును ఆలయ కమిటీ అధ్యక్షులు మహాజన్ జితేందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి పడాల ప్రభాకర్‌లు కోరారు. ఈ మేరకు ఆలయ కమిటీ బృందం గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జును కలిశారు.



నీటి సమస్యను పరిశీలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే బొజ్జు

చెక్ డ్యాం నిర్మాణానికి భూమి పూజ

పెంబి : మండలంలోని పుల్గంపాండ్రి గ్రామంలోని కడెం వాగుపై 13 కోట్ల 8 లక్షల నిధులతో మంజూరైన నూతన చెక్ డ్యాం నిర్మాణానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజుర సత్యం, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు స్వప్నిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే రాంరావు పటేల్



కస్తూర్బాగాంధీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాంరావు పటేల్

ముథోల్, మార్చి 14 : నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పటేల్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణంకు శంకుస్థాపన గురువారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కస్తూర్బాగాంధీ బాలికల కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.30 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో మైసాజి, ఎస్‌వో ఫరానాబేగం, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, ఎంపీటీసీ దేవోజి భూమేష్, డీఈఈ గంగాధర్ గౌడ్, నాయకులు నర్సాగౌడ్, ధర్మపురి సుదర్శన్, తాటివార్ రమేష్, సప్పటోళ్ల పోతన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని బోరిగాం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పటేల్ ప్రారంభించారు. ప్రొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రొద్దు తిరుగుడు క్వింటాల్ రూ. 6,760 ధరను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో తాము పండించిన పంటలను విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ముథోల్ నుండి విట్టోలి వయా బోరిగాం మీదుగా డబుల్ రోడ్డుకు కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డుకు భూమి పూజ

భైంసా రూరల్, మార్చి 14 : మండలంలోని వాలేగాంలో రూ. 5 లక్షల జడ్పీ నిధులతో నిర్మాణం చేపట్టనున్న గ్రావెల్ రోడ్డు పనులకు గురువారం ఎమ్మెల్యే రామారావు పటేల్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాలేగాం నుండి భైంసా పట్టణానికి గ్రామ ప్రజలకు దూర భారం తప్పనుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాగునీరు, రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

సంక్షిప్త సమాచారం

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సాపూర్(జి), మార్చి 14 : మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై గురువారం ఎస్సై మునిగెల హన్మాండ్లు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన వాహనపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు.

ఖానాపూర్ సీఐగా సైదారావు బాధ్యతల స్వీకరణ

ఖానాపూర్, మార్చి 14 : ఖానాపూర్ సీఐగా సైదారావు గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇన్నాళ్లు ఖానాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన డి. మోహన్ బదిలీపై శ్రీరాంపూర్ వెళ్లగా సైదారావు ఖానాపూర్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐగా బాధ్యతలు తీసుకున్న సైదారావుకు ఎస్సై లింబాద్రి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. అనంతరం సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రిలు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రతి ఓటరు ఈవీఎంపై అవగాహన కలిగి ఉండాలి

దస్తూరాబాద్, మార్చి 14 : ప్రతి ఒక్క ఓటరు, నాయకులు ఈవీఎం యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ కే.యాదవరావు అన్నారు. మండలంలోని ఎర్రగుంట గ్రామ పంచాయతీలో గురువారం ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. అనంతరం ఈవీఎం యంత్రాల పనితీరు, ఓటు ఎలా నమోదు చేయాలనే విషయంపై సమగ్రంగా వివరించారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్లు మధు, అభిలాష్, పంచాయతీ సెక్రటరీ ఇబ్రహీం, బీఎల్‌వో జ్యోతి, ఓటర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



లక్ష్మణచాంద, మార్చి 14 : మండలంలోని కనకాపూర్ గ్రామంలో రూ.20 లక్షల ఈజీఎస్ నిధుల అంచనా వ్యయంతో ఎంపీపీ అడ్వాల పద్మరమేష్ గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నిర్మల్ శాసనసభ్యులు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కృషితో ఈ నిధులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సుక్కు ముత్తన్న, చిన్నయ్య, వేణుగౌడ్, డి. శ్రీను, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి

తాంసి, మార్చి14: విద్యుత్ షాక్‌తో యువరైతు మృతిచెందిన ఘటన మండలంలోని కప్పర్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కప్పర్ల గ్రామానికి చెందిన మల్లెల అక్షయ్ (29) తన పంట చేనులో వేసిన జొన్నపంటను అడవి పందుల బెడద నుంచి రక్షించేందుకు విద్యుత్ తీగలు అమర్చాడు. గురువారం ఉదయం పొలంలోకి వెళ్లే క్రమంలో విద్యుత్ తీగను తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


‘అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి’

నేరడిగొండ, మార్చి14: పోషణ పక్షం ప్రోగ్రాంలో భాగంగా నేరడిగొండ, కుంటాల(బి) అంగన్‌వాడీ కేంద్రంలో మండల ఎంపీడీఓ పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలని చిరుధాన్యాలు బాలామృతంతో చేసిన పదార్థాం స్థానికంగా దొరికే పండ్లుమొలకలు వచ్చిన విత్తనాలు మునగాకు ఆకుకూరలు గర్భిణీలు, బాలింతలు, తీసుకోవాలని సూచించారు.

‘అధిష్ఠానం నిర్ణయానికి అనుగుణంగా పని చేస్తాం’

ముథోల్, మార్చి 14 : భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా పని చేస్తామని భారతీయ జనతా పార్టీ జిల్లా సహ కోశాధికారి, ఎంపీటీసీ సభ్యులు దేవీజి భూమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ముథోల్‌లో ఆయన మాట్లాడుతూ... ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానికి అధిష్ఠానం బీజే పీ అభ్యర్థిగా జి.నగేష్‌ను ప్రకటించిందన్నారు. అధిష్టానం ప్రకటించిన అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల్లో ఎమ్మెల్యే రామారావు పటేల్ నాయ కత్వంలో గెలుపు కోసం కృషి చేస్తామని వెల్లడించారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఎన్నికల్లో భారీ మెజారిటీ తీసుకురావడానికి ప్రయత్నిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిమ్మ పోతన్న, నాయకులు దత్తాత్రి, అంబర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.





నేటి నుంచి ఒంటిపూట బడులు


ఆదిలాబాద్‌అర్బన్, మార్చి14: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఈనెల15 నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు తరగతులు కొనసాగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలతోపాటు అన్ని ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు ఈ నిబంధనలు పాటించనున్నాయి. ఈ నెల 18నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో కేంద్రాలున్న పాఠశాలలు మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని డీఈఓ ప్రణీత తెలిపారు.

▸ బీజేపీలో చిచ్చురేపుతున్న ఎంపీ అభ్యర్థి ఎంపిక ▸ మోదీ జిల్లా పర్యటనతో మారిన పొలిటికల్ సీన్

▸ సిట్టింగ్ ఎంపీ సోయంకు షాకిచ్చిన ఢిల్లీ పెద్దలు ▸ అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఆశావహ నేతలు ▸ మొదలైన బుజ్జగింపులు.. మద్దతుపై అనుమానాలు

అంచనాలు తారుమారు!





ఆదిలాబాద్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి టికెట్ ఆశించిన నేతల అంచనాలు తారుమారయ్యాయి. ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేసినా చివరికి పార్టీ అధిష్ఠానం కొత్తగా పార్టీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌ను అభ్యర్థిగా ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. గోడం నగేష్ చేరికపై బీజేపీ సీనియర్ నేతలు అభ్యంతరాలు చెప్పినా అధిష్ఠానం ఏ మాత్రం పట్టించుకున్నట్లు కనిపించలేదు. ఢిల్లీకి వెళ్లి మరి బీఎల్ సంతోష్‌తోపాటు పలువురు ముఖ్యనేతలను కలిసినా ఫలితం లేకుండా పోయింది. అభ్యర్థి అధికారిక ప్రకటన కమలం పార్టీలో చిచ్చురేపుతోంది. జిల్లాలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఓ వర్గానికి నాయకత్వం వహించగా మరోవర్గం నేతలు మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ని నమ్ముకుని పార్టీలో కొనసాగుతున్నారు. ఇలారెండు వర్గాలుగా విడిపోయిన కమలం పార్టీ నేతలు ఎవరికి వారే టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేశారు. అయినా చివరకు కిషన్‌రెడ్డి వర్గానిదే పైచేయిగా మారిందన్న టాక్ పార్టీలో విన్పిస్తోంది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ కీలకంగా వ్యవహరించి కిషన్‌రెడ్డి ఆదేశాలతో గోడంనగేష్ పార్టీలో చేరేలా ప్రయత్నాలు చేశాడన్న వాదనలు బలంగా విన్పిస్తున్నాయి. మాజీ ఎంపీ చేరికపై తన ప్రమేయం ఏమీలేదని చెప్పే ప్రయత్నంచేసినా ప్రయోజనం కన్పించడంలేదు. కొంతకాలంగా సిట్టింగ్ ఎంపీ సోయంతో విభేదాలు తలెత్తడంతోనే ఆయనకు ప్రత్యామ్నాయంగా గోడం నగేష్‌ను తెరపైకి తెచ్చినట్లు పార్టీలో విస్తృతమైన చర్చ జరుగుతోంది. అయితే ఏకపక్ష నిర్ణయం తీసుకోవడంపై కొందరు సీనియర్ నేతలు బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం అందరూ పైకి బాగానే కనిపిస్తున్నా లోలోన మాత్రం రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. అసంతృప్తితో ఉన్న నేతలను అధిష్ఠానం పెద్దలు బుజ్జగిస్తున్నా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి మద్దతునివ్వడం అనుమానంగానే కనిపిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.





మోదీ సభలోనే ఎంపీకి చెక్

ప్రధాని మోదీ పర్యటన తర్వాత జిల్లా రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ నెల 4న మోదీ జిల్లాలో పర్యటించిన సందర్భంగా పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రధాని మోదీ జిల్లాకేంద్రంలో అధికారిక కార్యక్రమాన్ని ముగించుకుని అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొనేందుకు రావడంతో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ప్రధానిని సన్మానించేందుకు శాలువా, మెమొంటోతో సిద్ధమయ్యాడు. ప్రధాని అయిన భద్రత సిబ్బంది మోదీని సన్మానించేందుకు అనుమతిని నిరాకరించినట్లు తెలిసింది. అయితే సభా వేదికపై ననే ప్రధానిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ సన్మానించడం చర్చనీయాంశంగా మారింది. అసలు సిట్టింగ్ ఎంపీ మొదట ప్రధాని మోదీకి సన్మానం చేయాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగానే ఆయన సన్మానించకుండా అడ్డుకున్నా రనే టాక్ వినిపిస్తోంది. దీంతో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు చెక్ పెట్టారన్న చర్చ కూడా సాగింది. మోదీ ఆదిలాబాద్ పర్యటన తర్వాత మరుసటి రోజే హుటాహుటిన ఢిల్లీకివెళ్లిన సోయం బీఎల్ సంతోష్‌తోపాటు పలువురు ముఖ్య నేతలను కలిసినా ఏ మాత్రం ప్రయోజనం లేకుండానే పోయింది.

కారణం చెప్పకుండానే..

వలస నేతకు టికెట్ ఇచ్చి సిట్టింగ్ ఎంపీకి షాకిచ్చిన బీజేపీ అధిష్ఠానం ఎలాంటి కారణాలు చెప్పకుండానే సోయంను దూరం పెట్టిందన్న అభిప్రాయాలు విన్పిస్తున్నాయి. ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన సోయంను కాదని మరో ఆదివాసీ నేతకు అవకాశం కల్పించడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సిట్టింగ్ ఎంపీ సోయంబాపు రావుపై పెద్దగా అవినీతి ఆరోపణలు, ఎలాంటి వివాదాలు కూడా లేవు. గతంలో ఆదివాసీల ఉద్యమానికి నాయకత్వం వహించిన సోయంకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ నేతలతో సత్సంబంధాలు కూడా ఉన్నాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి ఘన విజయం సాధించాడు. అప్పట్లో బీజేపీ తరపున పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. సోయం గెలుపుతోనే జిల్లాలో బీజేపీ ఖాతా తెరిచింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్ స్థానాలు బీజేపీ దక్కించుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన సోయంకు క్రమంగా పార్టీలో ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది.

ఉందామా.. వెళ్లిపోదామా..

పార్టీనే నమ్ముకుని పనిచేసినా ప్రయోజనం లేకపోవడంతో ఇక పార్టీలో ఉందామా లేక వెళ్లి పోదామా అనే అభిప్రాయాలు బీజేపీ నేతల్లో వ్యక్తమ వుతున్నాయి. టికెట్ కోసం చివరివరకు ప్రయత్నాలు చేసినా ఊహించని విధంగా వలస నేతకు అవకాశం ఇవ్వడంపై ఆశావహ నేతలు అసంతృప్తి కి గురవుతున్నారు. ముఖ్యంగా మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ కొంతకాలంగా పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్నా అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్పఆధిక్యతతో ఓటమి పాలయ్యాడు. ఆ తర్వాత ఎంపీ టికెట్‌పై భారీ ఆశలు పెట్టుకున్నా అవకాశం దక్కలేదు. భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు తనకే టికెట్ వస్తుందని ఓ అడుగు ముందుకేసి కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారానికి ప్రత్యేక వాహనాలతో శ్రీకారం చుట్టారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా మద్దతునిచ్చిన ఆశించినా ఫలితం లేకుండానే పోయింది. అలాగే బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావు, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌లు ప్రయత్నాలు చేసిన పార్టీ అధిష్ఠానం పక్కన పెట్టింది. దీంతో ఆశావహ నేతల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వీరంతా ఎన్నికల వరకు పార్టీలో ఉంటారా లేదా అవకాశంవస్తే ఇతర పార్టీలోకి వెళ్తారా అనేది ప్రస్తుతం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

రేపు పిప్రికి ఉపముఖ్యమంత్రి రాక



సభాస్థలిని పరిశీలిస్తున్న ఆడె గజేంధర్, అధికారులు

బజార్‌హత్నూర్, మార్చి14: ఈనెల 16 (శనివారం) మండలం పిప్రి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రానున్నట్లు బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ తెలిపారు. పిప్రిలో ఏర్పాటు చేసే బహిరంగ సభకు ఏర్పాటును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో పిప్రి నుంచే ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాదయాత్రను ప్రారంభించారని, ఆ సమయంలో నియోజకవర్గ ప్రాంతంలో నెలకొన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే డిప్యూటీ సీఎం స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారని, ప్రజాపాలనలో భాగంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలు గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటారని వెల్లడించారు. అనంతరం సభాస్థలిని పరిశీలించారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటీసీ మల్లెపూల నర్సయ్య, బోథ్ మార్కెట్ చైర్మన్ గంగారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాయన్న, డీఎల్‌పీవో ఫణీందర్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్, మండల కన్వీనర్ జక్కె పాండురంగ్, నాయకులు పసుల చంటి, బద్దం పురుశోత్తం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కు



ఆదిలాబాద్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ అభ్యర్థిగా ఆత్రం సక్కును ఖరారు చేస్తూ ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. గురువారం ఆ పార్టీ అధినేత కేసీఆర్ అధికారిక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో సమావేశమైన కేసీఆర్ అందరితో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఆయనకు హామీ ఇచ్చిన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందిన ఆత్రం సక్కు ఆ తర్వాత బీఆర్‌ఎస్ పార్టీలో చేరిపోయారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. అలాగే ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్‌ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది.పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి మాజీ జడ్పీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం మొదటి నుంచి సాగింది. కానీ ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నేతలంతా ఆత్రం సక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది.

సంక్షిప్త సమాచారం

పోలింగ్ బూత్‌ల పరిశీలన

బజార్‌హత్నూర్, మార్చి 14: మండలం పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను సీఐ బానోత్ రమేష్ పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొల్హారి, బలాన్‌పూర్, బజార్‌హత్నూర్‌లలోని పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నరేష్, పోలీసులు పాల్గొన్నారు.

నాటుసారా అమ్మిన ముగ్గురిపై కేసు

ఉట్నూర్, మార్చి14: మండలంలో గుడుంబా వ్యాపారం సాగిస్తున్న ముగ్గురి వద్ద 10 లీటర్ల నాటుసారా పట్టుకొని కేసులు నమోదు చేశామని ఉట్నూర్ ఎక్సైజ్ ఎస్సై మురళికృష్ణ తెలిపారు. ఆదిలాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు గంగారెడ్డి, అక్బర్‌హుస్సేన్‌ల ఆధ్వర్యంలో మండలంలోని పేరికకూడా హనుమాన్ నగర్‌కు చెందిన బానోత్‌శంకర్, లకారానికి చెందిన ముంజంకాత్యాయిని, ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన కుచపు వినోద్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

ఘన్పూర్ చెక్ పోస్టు వద్ద ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

బోథ్, మార్చి14: మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు అంతర్రాష్ట రహదారిలో ఎస్పీ ఆదేశాల మేరకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అంతర్రాష్ట్ర జాతీయ రహదారిలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద సీఐ రమేష్, ఎస్సై రాములుల ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు.

ప్రభుత్వ భూములను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఉట్నూర్, మార్చి14: మండలంలోని లింగోజితండాలో ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఏజెన్సీ ఆదివాసీ యూనియన్ ఫోరం అధ్యక్షుడు గోడంనిరంజన్ కోరారు. గురువారం ఉట్నూర్ మండలకేంద్రంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై ఆలోచించి చర్యలు తీసుకుంటామని పీఓ ఖుష్బు గుప్తా వారికి హామీఇచ్చారు. కార్యక్రమంలో గ్లోబల్ మానవహక్కుల వేదిక అధ్యక్షుడు కురుసింగా సుదర్శన్,నాయకులు ఆత్రంకాశీరాం, నర్సింగ్‌మోరే, తదితరులు ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

తలమడుగు, మార్చి14: మండలంలోని బరంపూర్‌లోని తిరుమల కొండపై స్వయంగా వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ మఠం పీఠాధిపతి. యోగానంద సరస్వతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అధ్యాత్మికమార్గంలో నడుచుకోవాలని కోరారు. అనంతరం ఆలయంలో యజ్ఞ పూర్ణాహుతి, స్వామి వారి ఏకాంత సేవ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కేదారేశ్వర్‌రెడ్డి, సాగర సంఘం చైర్మన్ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ రేణుక, జీవీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, రంజిత్‌రెడ్డి, రమాకాంత్, తదితరులున్నారు.

ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్

జైనథ్, మార్చి14: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. గురువారం బేల మండలంలోని దహెగాం మనియార్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగు పై రూ.7 కోట్ల 10లక్షల వ్యయంతో నిర్మించే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఆర్‌అండ్‌బి అధికారులు బీజేపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ బేల మండలంలోని కాప్రి నుంచి మెయిన్‌రోడ్డు విస్తరణ కోసం రూ.60కోట్ల నిధులు అవసరం ఉండగా మొదట విడతగా రూ. 25కోట్లు మంజూరు చేయించామన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ప్రజారవాణా వ్యవస్థ ఏర్పాటుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ సురేష్, కాంగ్రెస్ నాయకులు ఫైజుల్లాఖాన్, యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ ప్రధాన కార్యదర్శి సామరూపెష్ రెడ్డి, అవినాశ్‌ఘోడే, బీజేపీ మండల అధ్యక్షుడు దత్తనిఖం, సుదీమ్, మురళీధర్‌టాక్రె, బీఆర్‌ఎస్ నాయకులు తేజరావ్‌వడ్‌కర్‌లతో పాటు దహెగాం మణియార్‌పూర్ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అన్నదాతలకు అన్నం పెట్టడం అదృష్టం

జైనథ్, బేల మండలాల సోయా రైతులు అన్నదాతకు అన్నం పెట్టడం నా అదృష్టమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా జైనథ్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని గురువారం అధికారులు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దతు ధరలేని కారణంగా సోయా పంటలను అమ్ముకోకపోతే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రభుత్వ రంగ సంస్థలతో కొనుగోలు చేస్తున్నామన్నారు. పాయల ఫౌండేషన్ ద్వారా రైతులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు కట్కంరాందాస్, దీపాయిగూడ ఎంపీటీసీ లోకకరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయండి

● స్వశక్తి మహిళా సంఘాలకే ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు ● అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

● వీసీలో కలెక్టర్, అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 14: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలకు అమ్మఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని సీఎస్ కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. గురువారం ఆమె హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటుపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, పాఠశాల ప్రధానఉపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. గ్రామంలో 2, 3 మహిళా సంఘాలు ఉంటే పాఠశాలకు దగ్గరగా ఉన్న మహిళా సంఘానికి మొదటి సంవత్సరం అవకాశం కల్పించాలని, కమిటీ అధ్యక్షులు మెంబర్ కన్వీనర్ కలిసి పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లుల కమిటీ సభ్యులుగా ఎంపిక చేస్తారని, రెండేళ్లపాటు పాఠశాల నిర్వహణ కమిటీ ఉంటుందని చెప్పారు. అమ్మపాఠశాల నిర్వహణ కమిటీకి ప్రత్యేక బ్యాంకుఖాతా ప్రారంభించాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూల్ యూనిఫార్మ్‌లు కుట్టే బాధ్యతను సైతం స్వశక్తి మహిళాసంఘాలకు కేటాయించామని, జిల్లాలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ యూనిఫాంలో కుట్టే సామర్థ్యం గల మహిళా సంఘాలను గుర్తించివారికి వెంటనే ఆర్డర్ అందించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల షైనర్, మేజర్ మరమ్మతులు, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదికి విద్యుత్‌సౌకర్యం కల్పన వంటి మౌలిక వసతులు అమ్మపాఠశాల కమిటీల ద్వారా జూన్10 వరకు కల్పించాలని ఆదేశించారు. యూడీఐఎస్‌ఈ 2023 డేటా ప్రకారం ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించికలెక్టర్లు వెంటనే పరిపాలన అనుమతులు మంజూరుచేసి జిల్లాస మాఖ్యకు అప్పగించాలని ఆదేశించారు.



వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఓటరుజాబితా, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ పై ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయపార్టీలు సహకరించరాలని కోరారు. ఎన్నికల నిబంధనలను అనుసరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ముళ్ల పొదల్లో బాలుడు

పసికందును తరలిస్తున్న స్థానిక మహిళలు



ముళ్ల పొదల్లో నవజాత శిశువు

● పసికందును వదిలి వెళ్లిన కఠినత్ములు ● నిపానిలో ఘటన

భీంపూర్, మార్చి14: కొన్నిగంటల ముందు జన్మించిన నవజాత శిశువును ముళ్ల పొదల్లో వదిలివెళ్లిన ఘటన భీంపూర్ మండలం నిపాని గ్రామంలో గురువారం కలకలం రేపింది. నిపానిలో గురువారం ఉదయం 6గంటల ప్రాంతంలో గ్రామం వెనుక పొదల నుంచి పసికందు ఏడుపులు వినిపించడంతో ఆ వైపు చేళ్లకు వెళుతున్న కొందరు గమనించి గ్రామపెద్దలు, పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ లోగా స్థానిక మహిళలు శివును దగ్గరికి తీసుకుని అక్కడే స్నానంపోసి శుభ్రంచేశారు. పోలీసులు శిశువును పరిశీలించి భీంపూర్ ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడ సిబ్బంది శిశువుకు తక్షణ చికిత్సచేసి ఆదిలాబాద్ ఐసీపీఎస్ వారు 1098 (బలరక్షక) వాహనంలో పసికందును ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

రైతుల ఖాతాల్లోని రూ.15 లక్షలు మాయం!

● సొంత ఖాతాలోకి మళ్లించుకున్న తపాలా శాఖ అధికారి

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి14: రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ తపాలశాఖ అధికారి వారి డబ్బులను సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్న ఘటన గురువారం పట్టణ తపాలశాఖ ప్రధాన కార్యాలయంలో వెలుగుచూసింది. ఈ విషయమై బాధిత రైతులు అసిస్టెంట్‌పోస్టల్ సూపరింటెండెంట్ పుష్పేందర్‌కు వినతిపత్రం అందించి న్యాయంచేయాలని కోరారు. సీసీఐకి పత్తి విక్రయించిన రైతులు ఆధార్ అనుసంధానం ఉన్న జాబ్ కార్డు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఈ క్రమంలోనే తపాల శాఖ బ్రాంచీ మేనేజర్ రైతుల డబ్బులను తన ఖాతాలోకి బదలాయించుకున్నాడు. ఇలా రైతుల వద్ద నుంచి సదరు దాదాపు రూ.15లక్షల వరకు డబ్బులను కాజేస్తున్నట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని బుర్నూర్‌కు చెందిన రైతు మునిగెల సురేష్ మాట్లాడుతూ సీసీఐకి పత్తిని విక్రయించిన డబ్బులు 2నెలలైనా అయిన జమ కాలేదని పోస్టల్ అధికారిని నిలదీయగా రెండురోజుల్లో వేస్తామని చెప్పాడని తెలిపాడు. అయితే పోస్టాఫీసు ఖాతా నుంచి కాకుండా అధికారి తన సొంత ఖాతా నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడంతో అనుమానం వచ్చిందని వెల్లడించారు. ఇతర రైతులకు కూడా చెప్పడంతో అధికారిని నిలదీయడంతో డబ్బులను వేస్తానని చెప్పి పత్తాలేకుండా పోయాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఖాతాల నుంచి డబ్బులు బ్రాంచ్ మేనేజర్ కాజేసినట్టు ఫిర్యాదు వచ్చిందని అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ పుష్పేందర్ తెలిపారు. విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని పోస్టల్ సూపరింటెండెంట్ వెల్లడించారు.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
ఇఫ్తార్ సా.6.31	సహర్ ఉ.5.02



ఎవరిని చూడగానే దైవం గుర్తుకువస్తాడో అతడే మీలో ఉత్తముడు